కథానిక

# సామాన్య మానవుడు

సి. ధర్మారావు

గోపాలరావు ఆపని చేశాడన్న వార్త వినేటప్పటికి నా కమితాశ్చర్యం కలిగింది. అంతాశ్చర్యం కల్గటానికి కారణం వాడి మనస్తత్వమే అయినా ఆ వార్త విన్న కొన్ని నిముషాలవరకుకూడ నేను వాణ్ణిగురించి ఆలోచించనే లేదు. ఏమిటా ఈ ప్రపంచం బొత్తిగా ఇంత బోధపడకుండా వుండిపోతోందే అనే మథనతో దాని అనేక వింతల వంక అలాగే నోరు తెరుచుకొని ఆలోచిస్తూ వుండిపోయాను. తరువాత గూడా-మీరు నన్నుగురించి ఏమైనా అనుకోండి. నాకేం ఫర్వాలేదు. ఎందుచేతంటే ఇక్కడ నన్నుగురించి నేనేమీ చెప్పదలచుకోటంలేదు. వీడు నాకింత స్నేహితుడు. ఒకచోటనే పుట్టాం, ఒక్కచోటే పెరిగాం, కలిసిమెలిసి తిరిగాం, వీడు నాతోనైనా చెప్పకుండా ఆ పని చేశాడేమిటీ అనే ఆలోచిస్తూ వాడిమీద కోపంకూడ తెచ్చుకున్నాను గాని, వీడా పని చేయటానికి బహుశా కారణాలు ఏమై వుంటాయా అని ఆలోచించనే లేదు.

అసలు నిజానికి ఆలోచించినా ఆ విషయంలో మాత్రం ఏ కారణాలూ చస్తే తట్టవు. వాడదోరకం మనిషి. వాడెప్పుడూ స్నేహితులతో ఏదో విషయం చర్చిస్తూనే వుంటాడు. రోజూ మనం నిత్యజీవితంలో చూసే ప్రతి సంఘటననికూడ, వాడు జీవితాన్నంతా కాచి వడపోసివున్న ఓ పెద్ద అనుభవశాలి-ఓ జీవిత విమర్శకుని దృష్టితో చూస్తాడు. ప్రతి సంఘటనకు, ఆ సంఘటనకు పూర్వ వృత్తాంతం ఏమై వుండవచ్చో, అప్పుడు ఎలాంటి పరిస్థితుల్లో ఆ సంఘటనలా జరగటానికి అవకాశ మేర్పడిందో ఆ సంఘటనయొక్క ఫలితాలెలా వుండవచ్చో అంతా పెద్దగా వ్యాఖ్యానించి చెప్పెయ్యగలడు. ఏదైనా ఒక పెద్ద దుర్మార్గపు పని ఒకడు చేసినప్పుడు వాణ్ణి పట్టుకుని మనంఅంతా సాధారణంగా తిట్టేస్తాం. కాని వాడు "అందులో పెద్ద జరుగకూడదనిదంటూ ఏమీ లేదు. అందులో అసంభవమైనదీ, అసహజమైనదీ నాకేమీ కనపడ్డం లేదంటూ" దాన్ని గురించి పెద్దగా విడమర్చి వ్యాఖ్యానించి చెప్తాడు. అట్లా అని, వాడు లోకంలో జరిగే ఎలాంటి విషయాలనుకూడ అసలు మార్పు, ఫీలింగు అనేవి లేకుండా ఒక నిర్జీవ వస్తువులాగ, ఒక మొద్దులాగ పూరికే చూస్తూ మాత్రమే వుంటాడనుకోటం, వాణ్ణి అపార్థం చేసుకోటమే అవుతుంది. కొన్ని విషయాలను చూచి విచారపడగలడు. మరికొన్ని వాటిని చూచి జాలిపడ్తాడు. మరి కొన్నిటిని చూస్తే కరిగిపోతాడు. మళ్లీ ఈ విషయాలను చూచి తనలో తాను నవ్వుకుంటాడు జీవితపు లోతులను తరుస్తూ.

ఏమాట కామాటే చెప్పుకోవాలి. వాడిమట్టుకి వాడికి అనేక కష్టాలు వచ్చాయి. రెండేళ్ళ క్రితమే వాళ్ళ నాన్న చనిపోయాడు. ఎం. ఏ. చదివి అప్పుడే కొత్తగా ఉద్యోగంలోకి ప్రవేశించిన వాళ్ళఅన్న పిచ్చెత్తి ఎటో దేశాలమీదకు పోయాడు. అన్న భార్య ఆత్మహత్య చేసుకుంది. పైగా అన్న కుటుంబం అలా నాశనమై పోవటానికి, గోపాలం బాగుకోసం అతనికి చాల దగ్గరవాళ్లు, స్నేహితులైనవాళ్లు ఏమిటేమిటో చేయించారని లోకమంతా ఆడిపోసుకుంది. దానికి వాడేమీ కుంగిపోలేదు. చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

పైగా వాణ్ణిగూర్చి చాల విచిత్రమైన సంగతి ఇంకోటుంది. వాడప్పుడప్పుడు నాతో అంటూంటాడు.

"ఒరేయి సూర్యం! కాళిదాసు, షేక్స్పియరు లాంటి నాటకరచయితలకుగాని, టాల్ స్టాయ్ లాంటి నవలా రచయితలకుగాని అంత కీర్తి ఎందు కొచ్చిందో తెలుసా! పాత్ర పోషణకు.

ఈ 'కారెక్టరు' ఇలాంటిది, ఇదిలాంటి పనులు చేస్తుంది అని గొప్పగా చిత్రించి చూపెట్టటం వల్లనే అంటారు..."

"అవును! పాత్ర చిత్రణలేనిదే ఏ నాటకం గాని, ఏ నవలగాని రక్తి కట్టదు. కథల్లో అయినా సరే అది చాలా అవుసరం" అన్నాను నేను.

"మీరక్కడే పొరపాటు పడుతున్నారు! ఒక పాత్రచేత ఎలాంటిపనులుచేయించి, దాన్ని ఎలాచిత్రించినా, అలాంటి పురుషులీలోకంలో నిస్సందేహంగా వుంటారు. ఈ పాత్ర ఇలాంటి ఆదర్శం గలది, ఆ పనులెలా చేస్తుంది? అనే ప్రశ్నే వుదయించనక్కరలేదు. కాళిదాసు శకుంతల అత్తవారింటికి వెళ్ళేప్పుడు కణ్వ పుడిచేత ఇంకేవిధంగా పలికించినా, ఆ పాత్ర చిత్రణకేమీ లోటుండదు. పాత్ర చిత్రణకే, రచయితలకు గొప్పతనాన్నంటగట్టడం నా వుద్దేశ్యంలో అనాలోచితమైన పని" అంటాడు మా గోపాలం.

ఇంకోసారంటాడు:

"ఈనాడు కొన్ని రొమాన్సు కథల పత్రికలంటూ వస్తున్నయ్ చూస్తున్నావా? అందులో ఏకథ చదివినా సారం, ప్రత్యేకత ఏమాత్రం వుండదు. అన్నీ ఒకే యంత్రంలో తయారయ్యే చెత్తసరుకు. సర్వసాధారణంగా ప్రతికథలోను ఒకతను ఒకమ్మాయిని 'ప్రేమిస్తా'ంటాడు. అది నిజానికి ప్రేమ ఏమాత్రం కాదు. ప్రతిఅమ్మాయి కూడ యౌవనదశ కొచ్చిన 'పొరుగింటి'అమ్మాయే అయి వుంటుంది. లేకపోతే ఏ సంగీతమో, నృత్యమో నేర్చుకోవడానికె ఒక యువకుడైన గురువుగారి దగ్గర ప్రవేశపెట్టబడుతుంది. అతను ఆమెయొక్క అందాన్ని చూచో, వక్షాల బిగువు చూసో, ఏనాడైనాపొరపాటున వానలో తడిసి వస్తే ప్రతి అవయవము యొక్క 'లావణ్యం' చూసో ఆ అమ్మాయిని 'ప్రేమిస్తూ' వుంటాడు. ఇక ఆ అమ్మాయి కూడా అతన్ని 'ప్రేమించ' టానికి పెద్దకారణాలేమీ అక్కర్లేదు. అతను యువకుడు. పైగా నల్లని అతని జుట్టు ఉంగరాలు తిరిగి చూట్టానికి యెంతో 'ఇది' గా వుంటుంది. అందులో ఒక 'వుంగరం' అతని నుదుటిమీదికి పడ్తూంటుంది. ఇంకేం, వాళ్లు అన్యోన్యంగా 'ప్రేమించు' కుంటారు. ఇక ఆ 'పాడు సంఘం' గురించి చెప్పక్కర్లేదు. 'ప్రేమ'అనే పదం ఎక్కడ కనపడినా ఏమాత్రం సహించలేదు. వెన్నాడి తరుముతుంది. కళ్లు, చెవులు, హృదయం ఏమీలేని సంఘం. మరి ఆ సంఘాన్నంత నీచంగా తిట్టి, అందులో ఏం మార్పులు తీసుకు వస్తారో నా కీనాటికీ అర్థం గాలేదురా సూర్యం! అసలు గమ్మత్తంతా ఎక్కడ వుందంటే, ఆ 'ప్రేమికు' లిద్దరూ ఈ సంఘంతో పడలేక ఆ వూరు వదలి ఎటో పోతారు."

"నీ దంతా కొత్త వితండం లేరా! వాళ్ళిద్దరూ ప్రేమించుకొంటూవుండిరి. ఆ అమ్మాయి తలిదండ్రులుగాని, లోకంగాని వాళ్ళ వివాహానికి ఒప్పుకోరయ్యె! పైగా ఆ అమ్మాయిని తీసుకెళ్ళి, ఆమె కిష్టంలేని వాడికెవరికో అంటగడతారయ్యె. ఎవడైతే మాత్రం ఏం చేస్తాడురా" అన్నాను నేను.

"చెప్తా విను, తలి దండ్రులకి, సంఘానికి కూడ ఎన్నో విధాలుగా మంచిగా నచ్చ చెప్పాలి. ఎంతకీ వినకపోతే కొంతవరకు బెదిరించినా తప్పులేదు. అప్పటికీ వినకపోతే, ఆ సంఘం చూపించిన వరుణ్ణే ఆ అమ్మాయి చేసుకోవాలి" అంటాడు గోపాలం.

"మరి వాళ్ళ ప్రేమ?" అన్నాను నేను ఆత్రుతతో.

"ప్రేమ ఎక్కడికి పోతుంది? వాళ్ళ వివాహం సమకూడనంతమాత్రాన ప్రేమ ఎక్కడికీ పోదు, అది నిజమైన ప్రేమ అయితే. ప్రేమ నిత్యమైనది. ఆ అమ్మాయి విశాల హృదయం గలదైతే, ఆ సంసారంలోని బాధలను తనలో దాచుకుంటూనే, ఆమె తన ప్రేమికుణ్ణి ప్రేమించగలదు, ఎందుచేతంటే నిర్మలమైన ప్రేమ శరీర సాంగత్యం లేనంత మాత్రాన శిథిలమైపోదు. పోనీ, ఆమె అంత విశాలహృదయ కాకపోవచ్చు. అప్పుడామె జీవితం విషాదాంతం అవుతుంది. అలాంటి ఒక విషాదాంత ప్రణయజీవితం మొద్దుబారిన సంఘంలో చాలా మార్పు తెస్తుంది. అంతేగాని సంఘాన్ని తిట్టి, సంఘంనుంచి పారిపోతే

సంఘంలో మార్పెలా తేగలరు?" అంటాడు గోపాలం.

అలాంటి గోపాలం ఆ పని చేశాడంటే ఆశ్చర్యం కలగక ఏమవుతుంది! వాడు చాలా హృదయపూర్వకంగా భారతిని ప్రేమిస్తున్నాడు. ఆఅమ్మాయికూడ వీడంటే ఎంతో ఇష్టం. గోపాలం కొంచెం ఆస్తి వున్నవాడే. బి. ఏ. ప్యాసయ్యాడు. వాడు భారతిని వివాహం చేసుకుంటానంటే వాళ్లతల్లి వద్దనదు. భారతి కూడ కొంతవరకు చదువుకొన్నదే! బహుశా వాళ్ళ తలిదండ్రులకు ఈ సంబంధం ఇష్టంలేదై వుండాలి! ఇష్టం లేకపోతే మాత్రం ఇన్ని వుపన్యాసాలు కొట్టేవాడు, వీడలా ఆమెతో ఎక్కడకో పోవడమేమిటి? పైగా నాతోనైనా చెప్పలేదు!

ఇలాంటి ఆలోచనలతో నాబుర్ర వేడెక్కిపోయింది. వాళ్లెక్కడున్నారో వాకబుచేసి వాళ్ళదగ్గరకోసారి వెళ్లాలనుకున్నాను. వాడు నాతో చెప్పకుండా ఇలా ఎందుకు చేశాడో గట్టిగా కనుక్కోవాలి అని నిశ్చయించుకున్నాను.

వాడు వెళ్ళిపోయిన నెలరోజులకు వాడి దగ్గరనుంచి ఓ ఉత్తరం వచ్చింది. వాడు కాకినాడలో వుంటున్నాట్ట. ఒక బ్యాంకులో ఏదో వుద్యోగమట. నెలకు నూటముప్ఫై రూపాయలు జీతంఅట. ఓ స్నేహితుడి సహాయంవల్ల వాడికా వుద్యోగం లభించిందట. చాలా హాయిగా గడిచిపోతున్నదట. నన్నోకసారి రమ్మని కూడ వ్రాశాడు. పైగా విచిత్రమేమిటంటే, తరువాత కొద్దిరోజులకు వాళ్ళఇంటికి, భారతి నాన్నగారింటికి కూడ వుత్తరాలు వ్రాశారు వాళ్ల సంగతిని గూర్చి. నాకు చాల ఆశ్చర్యంవేసింది. పైగా భారతి నాన్నా వాళ్లు వెళ్ళి, అక్కడో పెద్ద రభసచేసి వాళ్లమ్మాయిని తెస్తారు. వెళ్ళిపోయినవాడేదో వూరుకోక, వీళ్లకూడా ఎందుకు వుత్తరం రాశాడా అని నాకు వాడిమీద జాలివేసింది.

తరువాత నేను కాకినాడకు ప్రయాణంగట్టి వాళ్ళింటికి చేరుకున్నాను. వెళ్లేటప్పటికి చీకటి పడింది. వరండాలో లైటు వెల్గుతున్నది. ఎక్కడనుండి చూసిందో గాని వాళ్లఆవరణలో అడుగుపెట్టగానే భారతి నవ్వుతూ ఎదురు వచ్చింది.

"మొత్తంమీద మమ్మల్ని ఏవగించుకుని, స్నేహం మరచిపోలేదన్నమాట. మేమంటే అభిమానం, సానుభూతీ మీకింకా వున్నాయన్నమాట" అన్నది నవ్వుతూ.

అవీ ఇవీ మాట్లాడుకున్నాక, భారతి స్నానానికి నీళ్లుపెట్టి "స్నానానికి లేవండ" న్నది. నేను స్నానంచేసి వచ్చి బట్టలు కట్టుకొంటూండగా గోపాలం కూడ ఆఫీసు నుంచి వచ్చాడు.

"ఏరా! నేను ఉత్తరంవ్రాసి వారంరోజులయిందిగా! ఇంతాలస్యంగా వచ్చావేం ?" అన్నాడు మా గోపాలం.

"అసలు రావద్దే అనుకుని, పోనీ ఎలాగో వెళ్ళి నాలుగు చీవాట్లుపెట్టి వద్దామనుకున్నారుగాబోలు" అంది భారతి నవ్వుతూ.

"అబ్బే! అదేమీ లేదు. ఏవో వెధవపనులు. కొంచెం తొందరగా వుండటంచేత కొద్దిగా ఆలస్యమయింది" అన్నాను నేను.

ఆరాత్రి ఇద్దరం కలిసి భోజనాలు చేసి హాయిగా బయట కూర్చుని ఏవేవో పిచ్చాపాటి మాట్లాడుకున్నాం చాలసేపు. అక్కడ భారతి కూడావుంది. నేనుమాత్రం ఆవిషయం మర్నాడు భారతి లేనప్పుడు గట్టిగా కదిలిద్దామనుకుని వూరుకున్నా.

మర్నాడు ప్రొద్దున్నే లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానాలు పూర్తిచేశాం. ఇద్దరం చెరోకుర్చీమీద కూర్చుని ఏదో మాట్లాడుతున్నాం వాడి పడకగదిలో. భారతి కాఫీ, ఫలహారాల పనిలో నిమగ్నురాలై వుంది.

"ఏరా! నాతో చెప్పకుండానే ఇంతపని చేశావు?" అన్నాను గోపాలంతో కొంచెం కోపంగానే,

"ఏం? కోపంగావుందా? చిన్నప్పటినుంచి కలిసి చదువుకున్నాం. కలిసి తిరిగాం. బాగా కలిసిపోయిన దగ్గరి స్నేహితుడివి. నీతో చెప్పాల్సిన అవసరం అంతగా వుందని నేననుకోలేదురా సూర్యం!" అన్నాడు గోపాలం.

దాంతో నా కోపం పూర్తిగా చల్లారిపోయింది సరిగదా, నాలో నేను సిగ్గుపడ్డాను.

ఈ విషయం మీద వీడితో అనవసరంగా కోపంగా మాట్లాడానే అని.

"అదీ సరేగాని, ఏమిటిరా, ఈ పనిచేశావు? మీ వివాహానికి భారతి తలదండ్రులు ఒప్పుకో లేదా?" అని అడిగాను, తన్నుకు చస్తున్న నా సందేహం తీర్చుకుందామని.

"అసలు వాళ్ల తలిదండ్రులు మా వివాహానికి ఒప్పుకోరనే భయంతో మేమిలా ఒచ్చేశామని ఎవరన్నారు? నా అన్న సంసారపు "వుసురు" గొట్టి నేను నాశనమైపోతానని వాళ్ళకు తగిన భయమట. అంచేత భారతి చెప్పినా ఒప్పుకునేవారు కాదు. ఐనా భారతి అంది "నేను మారాంచేసి, ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటానని బెదిరిస్తే మాత్రం, వాళ్లు అతి ప్రయత్నంమీద ఒప్పుకుంటారు. కాని నాకా రభసంతా చెయ్యటం అంతగా ఇష్టంలేదు. మీ స్నేహితు డెవరో ఉద్యోగం దొరుకుతుందని రాశా డన్నారు కదా. అక్కడికి పోదాం పదండి, హాయిగా వుండొచ్చు" అంది. అంతే గాని వాళ్ళ తలిదండ్రులొప్పుకోరని భయంతో రాలేదు" అన్నాడు గోపాలం.

"భారతి అలా అంటేమట్టుకి, అన్నిలెక్కలు దంచేవాడివి, వూళ్ళో మిమ్మల్ని గురించే ఇలా అనుకుంటారనైనా నువ్వెందుకు ఆపలేదు భారతిని?" అన్నాను నేను నా సందేహం ఇంకా తీరక.

"అదే నేనెప్పుడూ నీతో చెప్తూండేది. ప్రపంచంలో ఇలాటి మనిషి, ఈ పనెప్పుడూ చెయ్యడనుకోవటం పొరపాటు. ఇటువంటి తరహాకి చెందిన వ్యక్తి, ఆ తరహాకి చెందిన పనులేమీ చెయ్యడనే నమ్మకముంచుకోవటం అసలు అర్థంలేని పని. అందుకనే "పాత్రపోషణ" అనే విషయం తీసుకుని రచయితలను గొప్పతనాన్ని ఇవ్వటం అనేది నాకు చాల అర్థరహితమైన పనిగా తోస్తుందని నీ కిదివరకే చెప్పాను. ఏమిటో, నాజీవిత సర్వస్వం అయిన భారతితో నన్నంతా ఎరిగిన వాళ్ళలోనే వుండి, స్వర్గసౌఖ్యా లనుభవించటంలో నాకు తృప్తి వుండదని నాకనిపించింది. ఇక భారతి గూడ తన అభిప్రాయం వ్యక్త పరిచేసరికి, ఇద్దరం ఇక్కడి కొచ్చేశాం" అన్నాడు గోపాలం గంభీరంగానే.

గోపాలం వింత మనస్తత్వం గురించి ఆలోచిస్తూ, నా సందేహం ఇంత సులువుగా తీర్చేశాడే అని అనుకుంటూ, అప్పుడే భారతి తెచ్చిన ఫలహారాలలో వాళ్ళతో పాటు నేనూ చెయ్యి వుంచాను.

# కుందేళ్లు భయాన్ని జయించిన విధం

కుందేళ్లు చదువు నేర్చుకున్నాయి. ఆ తరువాత అందులో ఒక కుందేలుకి గొప్ప గ్రంథరాజం ఒకటి దొరికింది. గ్రంథం పేరు "ఉదాత్త ఉపదేశం" అది తోటి కుందేళ్ళందరికీ ఆ సంగతి చెప్పింది. విని కుందేళ్ళన్నీ సంతోషంతో గెంతాయి. త్వరలోనే భారతదేశంలోని కుందేళ్ళన్నీ వేలకొద్దీ ఒకచోట గుమిగూడి, ఒక బ్రహ్మర్షి కుందేలు ఆ పుస్తకాన్ని పైకి చదువుతూంటే, చెవుల నిక్కబొడిచి వినడం ఆరభించాయి.

మొదటి పేజీ తీసి బ్రహ్మర్షి కుందేలు చదవడం ఆరంభించింది: "మనకు మహా శత్రువు ఎవరంటే 'భయం' అన్న భావం." ఆ వాక్యం వినేసరికి కుందేళ్ళ సమావేశాన్ని గంభీరమైన నిశ్శబ్దం ఆవరించింది. ఎంత నిజం! ఆ పుస్తకం మనుషులకోసం రాయబడిందే అయినా, కుందేళ్లు నేర్చుకోవలసిన విషయాలుకూడా అందులో ఉన్నాయి! భయాన్ని జయించడం ఎలాగో తెలుసుకుందామని సావధానంగా వినడం సాగించాయి.

బ్రహ్మర్షి ఇంకా చదివింది: "భయం అంటే ఏమిటి? నిజానికది భ్రాంతి మాత్రమే. అయితేనేం? దానికి లొంగిపోతే ఎంత ధ్వంసం చేసేస్తుంది మనల్ని! ఆలోచించండి! ఈ భయం